

అబద్ధపు హామీలతో

# గద్దెనెక్కారు!

- హామీలను నెరవేర్చని కాంగ్రెస్ కు ఓటు ఎందుకు వేయాలి?
- నాకోసం పనిచేసిన వారిని కాపాడుకుంటా
- వచ్చేది మన ప్రభుత్వమే
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు

పార్టీ కోసం పనిచేసిన వాళ్లను కాపాడుకుంటానని, అబద్ధపు హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ పార్టీకి ఓటు అడిగే నైతిక హక్కు లేదని మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు అన్నారు. ఇచ్చిన ఏ హామీ ని రేవంత్ ప్రభుత్వం నెరవేర్చలేదన్నారు. మహిళలను, వృద్ధులను, నిరుద్యోగులను మోసం చేసే పనిలో పడ్డారన్నారు.

సిద్దిపేట ప్రతినిధి, (సిరి న్యూస్)

5

తెలుగు డిజిటల్ దినపత్రిక

# సిరి

...People Voice | www.siridaily.com

మంగళవారం, జులై 22, 2025 | సంపుటి-1 సంచిక-222 పేజీలు-10

The Largest Readers Local Digital Daily




# అక్రమాల జాతర..
# నిబంధనలకు పాతర

## అవినీతికి నిలయంగా కరెంట్ కార్యాలయం

- సంగారెడ్డి డివిజన్ లోనే తిష్ట వేసిన జేఏవోలు
- పోస్టింగ్ ఉత్తర్వులు అడిగితే మౌనం
- వివరాలు అడిగితే ముఖం చాటేస్తున్న వైనం
- 8 నెలలు విధులకు రాకుండానే జీతం
- నాలుగేళ్ళ రికార్డు ఫైళ్లు మాయం
- ఏంఆర్టిలో బయటపడ్డ మరో ఉద్యోగి బాగోతం
- జిల్లా విద్యుత్ శాఖలో రోజుకో అవినీతి బాగోతం
- విచారణ చేస్తున్నామంటూ కాలయాపన
- ప్రతి అవినీతిలో అధికారులకు వాటాలు ఉన్నట్లు అనుమానం
- విద్యుత్ ఉద్యోగులు, యూనియన్లు మొరపెట్టుకున్నా ఫలితం శూన్యం

సంగారెడ్డి జిల్లా విద్యుత్ శాఖ కార్యాలయంలో జరుగుతున్న అవినీతి, అక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. సిరి దినపత్రికలో వరుస కథనాల రూపంలో ఒక్కొక్కరి బండారం బయటపెడుతున్నప్పటికీ మరో అధికారి అవినీతి బాగోతం వెలుగులోకి వచ్చింది. అంతేగాకుండా ఉన్నతాధికారుల డోల్లతనం, అక్రమార్కులను కాపాడాలనే ఆలోచన మరోసారి తేటతెల్లమయింది. సంగారెడ్డి డివిజన్ లో ఉండవలసిన పోస్టుల కంటే అదనంగా ఒక జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్ ను సంగారెడ్డి డివిజన్ లోనే సృష్టించారు. సిద్దిపేట నుండి డిప్యూటేషన్ పై వచ్చిన జేఏవోగా లేని పోస్టును సృష్టించి తన ఇష్టానుసారంగా ఒకటిన్నర సంవత్సర కాలం పాటు అదనపు విధులను అప్పగించడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సంగారెడ్డి డివిజన్లో ఖాళీ లేనప్పటికీ ఖాళీ ఉన్న జహీరాబాద్, జోగిపేట డివిజన్ లను వదిలి సంగారెడ్డిలోనే ఉంచి, నెలనెలా జీతాలు ఇవ్వడం, ఖాళీ ఉన్నచోట జేఏవోలను భర్తీ చేయకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి...

-(సంగారెడ్డి ప్రతినిధి-సిరిన్యూస్)

3

# పెట్రేగుతున్న మైనింగ్ మాఫియా!



## అనుమానాస్పద అనుమతులతో జోరుగా మట్టి దందా

- అంతులేని దోపిడీకి నిదర్శనం
- చెరువులు మాయం.. రోడ్లు ధ్వంసం
- నిబంధనలకు పాతరేసి మట్టి దోపిడీ
- నరకప్రాయంగా నాగుసానిపల్లి రోడ్లు
- పల్లె రోడ్లపై ప్రాణాంతక ప్రయాణం
- కలెక్టర్ అనుమతి ఉందని కాంట్రాక్టర్ సవాల్
- మట్టి మాఫియాకు అడ్డుకట్ట ఎప్పుడు ?
- మామూళ్ళ మత్తులో అధికారులు

4

(పాపన్నపేట-సిరిన్యూస్) పాపన్నపేట మండలంలో మైనింగ్ మాఫియా అంతులేని ఆగడాలకు పాల్పడుతోంది. చెరువులను అక్రమంగా తవ్వి మట్టిని తరలిస్తూ పల్లె రోడ్లను విధ్వంసం చేస్తున్నారు. ఈ దారుణమైన దోపిడీకి కొంతమంది అధికారులు మద్దతుగా నిలుస్తుండటం సర్వత్రా విమర్శలకు దారితీస్తోంది. సామాన్య ప్రజలు ఇంటి అవసరాల కోసం చిన్నపాటి ఇసుక తీసుకెళ్తే కేసులు పెట్టే అధికారులు, కోట్లాది రూపాయల మట్టి వ్యాపారస్తులపై కనీసం కన్నెత్తి చూడకపోవడం అనేక అనుమానాలను రేకెత్తిస్తోంది.




# వీడిన మర్డర్ మిస్టరీ

## ఆర్థిక లావాదేవీలు, వ్యక్తిగత కక్షలే హత్యకు కారణం

- పక్కా ప్లాన్ తో కాపుకాసి వెంబడించి హత్య చేశారు
- పోలీసుల అదుపులో ఐదుగురు నిందితులు, మరో ఇద్దరు పరారీలో
- ఏడు బృందాలుగా పోలీసులు గాలింపు చర్యలు, వారం రోజుల్లో కేసు చేదింపు
- వివరాలు వెల్లడించిన జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు

2

# హాస్టళ్లపై పర్యవేక్షణ ఏదీ?

- కొట్టొచ్చినట్లు కనిపిస్తున్న అధికారుల నిర్లక్ష్యం
- మొర్గి ప్రభుత్వ మోడల్ మోడల్ పాఠశాలలో విద్యార్థులకు ఫుడ్ పాయిజన్
- 11 మంది విద్యార్థులు వాంతులు, విరేచనాలు
- నాణ్యమైన భోజనం అందించడంలో విఫలం
- ప్రభుత్వ ఆదేశాలు భేఖాతర్
- పరామర్శించిన ఎమ్మెల్యే సంజీవరెడ్డి, మాజీ ఎమ్మెల్యే

5

# వీడిన మర్డర్ మిస్టరీ

## ఆర్థిక లావాదేవీలు, వ్యక్తిగత కక్షలే హత్యకు కారణం

- పక్కా ప్లాన్ తో కాపుకాసి వెంబడించి హత్య చేశారు
- పోలీసుల అదుపులో ఐదుగురు నిందితులు, మరో ఇద్దరు పరారీలో
- ఏడు బృందాలుగా పోలీసులు గాలింపు చర్యలు, వారం రోజుల్లో కేసు చేదింపు
- మర్డర్ మిస్టరీ వివరాలు వెల్లడించిన జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు




**మెదక్ ప్రతినిధి జులై 21(సిరి న్యూస్):** ఈనెల 14న కొల్చారం మండలం వరిగుంతం సబ్ స్టేషన్ వద్ద జరిగిన మరెల్లి అనిల్ హత్య కేసును ఎట్టకేలకు పోలీసులు చేదించారు. ముందుగా ప్రమాదవశాత్తు జరిగిన సంఘటనగా భావించిన పోలీసులకు ఘటన స్థలంలో తూటాలు లభించడంతో హత్య కోణంలో దర్యాప్తు ముమ్మరం చేసి వారం రోజుల్లోనే ప్రధాన నిందితుని సహా సోమవారం నాడు ఐదుగురిని అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు వివరాలను వెల్లడిస్తూ... మృతుడు మరెల్లి అనిల్ హత్య కేసును జిల్లా పోలీసులు ఛాలెంజ్ గా తీసుకుని ఇద్దరు డిఎస్పీలు, ఐదుగురు సీఐలు, ఏడుగురు ఎస్సైలతో మొత్తం ఏడు బృందాలు రంగంలోకి దిగి దర్యాప్తు ముమ్మరం చేసి కేసు చేదించి నిందితులను పట్టుకున్నామన్నారు. ఈ కేసులో ప్రధాన నిందితునిగా కొల్చారం మండలం పైతర గ్రామానికి చెందిన ఏ1 సోమన్నగారి రవీందర్ రెడ్డితోపాటు అదే మండలం రంగంపేట గ్రామానికి చెందిన ఏ2 పడేపు నాగరాజు, ఏ3 పడేపు నాగభూషణం, ఏ4 షాబుద్దీన్ (విజయవాడకు చెందిన వ్యక్తి), ఏ5 ఫరీద్(కొల్చారం మండలం రంగంపేట గ్రామం), ఏ6 చిన్న (విజయవాడకు చెందినవ్యక్తి), టేక్మాల్కు చెందిన ఏ7 తలారి అశోక్లు ఈ ఘాతుకానికి పాల్పడ్డట్లు తమ విచారణలో తేటతెల్లమైందన్నారు. వీరిలో ఏ4 షాబుద్దీన్, ఏ6 చిన్నలు పరారీలో ఉండగా మిగతా వారిని సోమవారం అదుపులోకి తీసుకొని కోర్టులో రిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. మిగతా వారిని కూడా అతి త్వరలోనే పట్టుకుంటామని ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు వెల్లడించారు. ఈ కేసు చేధించేందుకు శ్రమించిన పోలీసు అధికారులను ఎస్పీ ఈ సందర్భంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ మహేందర్, డిఎస్పీ ప్రసన్నకుమార్, సీఐలు రాజశేఖర్రెడ్డి, రేణుకారెడ్డిలతోపాటు పలువురు ఎస్సైలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

### పక్కా ప్లాన్ తోనే హతమార్చారు

మృతుడు మరెల్లి అనిల్(29)ను హతమార్చేందుకు నిందితులు పకడ్బందీ ప్లాన్ వేసి హతమార్చినట్లు ఎస్పీ వెల్లడించారు. కత్తులతో పొడిచి చంపితే స్థానికులపై అనుమానాలు వస్తాయనే యోచనతో తుఫాకితో కాల్చి చంపుదామని నిర్ణయించుకున్నారు. ఈ హత్యను దారిదోపిడి హత్యగా చిత్రీకరించేందుకు అనిల్ వద్ద ఉన్న నగదును తస్కరిస్తే దారి దోపిడి దొంగలపనిగా చిత్రీకరించడానికి పక్కా ప్లాన్ వేశారు. ఈ ప్లాన్ మొత్తం రవీందర్రెడ్డి కనుసన్నల్లో కొనసాగిందని పోలీసులు వెల్లడించారు. ఈ హత్య కోసం ఏ5గా ఉన్న నిందితుడు ఫరీదు పరిచయం ఉన్న బీహార్ లోని పాట్నాకు చెందిన సచిన్ కుమార్ వద్దకు గత నెల 27నాడు విమానంలో బయలుదేరి వెళ్లి లక్షయాభైవేలకు ఒక తూపాకి పది బుల్లెట్లు కొనుగోలు చేసి అక్కడే నాలుగు రౌండ్ల కాల్పుల ప్రాక్టీస్ చేసి రైలు మార్గంలో తిరిగివచ్చాడు. నిందితులు ఈనెల 13వ తేదీనాడు అనిల్ ను హత మార్చడానికి రెక్కి నిర్వహించగా వీలు కాలేదు. దీంతో మరుసటి రోజు 14నాడు మృతుడు అనిల్ గాంధీ భవన్ కు వెళ్లే మార్గంలో నిందితులు అతనిని అనుసరించి తిరుగు ప్రయాణంలో గుమ్మడిదల టోల్ గేట్ వద్ద అందరు కలిసి రెండు కార్లలో మృతున్ని అనుసరించారు. మృతుడు అనిల్ వెంట ఉన్న శేఖర్ అనే వ్యక్తి తన స్వగ్రామమైన అప్పాజిపల్లిలో దిగిపోగా అక్కడినుంచి ఒంటరిగానే అనిల్ ఇంటికి బయలుదేరాడు. దీనిని అదునుగా బావించిన నిందితులు కొల్చారం మండలం వరిగుంతం సబ్ స్టేషన్ వద్ద మారుతీ 800 కారును అనిల్ కారుకు అడ్డంగా అవగా అనిల్ ఎందుకు అడ్డంగా నిలిపారని ప్రశ్నించేలోగా వెనక ఉన్న మరోక కారు షిఫ్ట్ డిజైర్ (టీజీ 08 టీ 4481) నుంచి షాబుద్దీన్ దిగి నాలుగు రౌండ్లు అనిల్ పై కాల్పులు జరిపాడు. దీంతో అనిల్ తప్పించుకోబోయి పక్కనే ఉన్న సబ్ స్టేషన్ గేట్ కు కారును గుద్దుకొని అక్కడికక్కడే మరణించాడు. ఈఘటనలో మారుతీ 800లో ఏ3 నాగభూషణం అడ్డుకోగా షిఫ్ట్ డిజైర్ లో లో ఏ4 షాబుద్దీన్ తో పాటు ఏ5 ఫరీద్, ఏ6 చిన్నాలు హత్యకు పాల్పడ్డారు.



అనిల్ హత్యలో ప్రధాన నిందితుడు సోమన్నగారి రవీందర్ రెడ్డి

### హత్యకు దారి తీసిన కారణాలు

మృతుడు మరెల్లి అనిల్ (29) స్వస్థలం కొల్చారం మండలం పైతర గ్రామవాసి. ఇతను సోమన్నగారి రవీందర్రెడ్డికి అత్యంత అనుచరుడు. రవీందర్ రెడ్డి రాజకీయ ప్రస్థానంలో కూడా మృతుడు అనిల్ ప్రధాన అనుచరుడు. ఈ తరుణంలోనే రవీందర్రెడ్డికి చెందిన వ్యవసాయ భూమిని లీజుకు తీసుకుని సాగు చేయడంతోపాటు మరొక్క స్థలాన్ని లీజుకి తీసుకుని పెట్రోల్ బంక్ ఏర్పాటు చేసి కొనసాగిస్తున్నాడు. ఈ తరుణంలో ఇరువురికి ఆర్థిక లావాదేవీల విషయంలో చిన్నపాటి మనస్పార్థలతో దూరం పెరిగింది. దీంతో రవీందర్ రెడ్డి వద్ద లీజుకు తీసుకున్న వ్యవసాయ భూమిలో అనిల్ కబ్జాలో ఉండి సాగుచేసేందుకు ఇతరులను కూడా అడ్డుకున్నాడు. దీంతో వారి మధ్య వైరం తారాస్థాయికి చేరుకుంది. అంతేకాకుండా రవీందర్రెడ్డికి అక్రమ సంబంధాలు ఉన్నాయనే అసత్య ప్రచారాన్ని చేస్తున్నాడని అనిల్ప కోపాన్ని పెంచుకున్నాడు. దాంతోపాటు ఏ2గా ఉన్న నాగరాజు కూడా మృతుడు అనిల్ పై రాజకీయ కక్షసాదింపులు ఉండటంతో పాటు నాగరాజు తల్లి పేరిట మంజూరైన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లును అనిల్ ఆపివేయించాడని కక్ష పెంచుకున్నాడు. ఇక మూడవ నిందితుడు నాగభూషణంకు అనిల్ కు ఆర్థిక లావాదేవీల విభేదాలు ఉన్నాయి. మృతుడు అనిల్ గతంలో ఆరులక్షల రూపాయలు నాగభూషణం వద్ద అప్పుగా తీసుకొని తిరిగి చెల్లించలేదు. నాగభూషణం అప్పు బాపతి డబ్బులు అడగగా తనకు ఉన్న చెప్పుకోలేని ఆనారోగ్య సమస్యను బహిరంగంగా వెల్లడిస్తాననే బ్లాక్మెయిల్ చేయడంతో ఇరువురి మధ్య వ్యక్తిగత కక్షలు తారాస్థాయికి చేరాయి. గత కొంత కాలం క్రితం రవీందర్రెడ్డి భార్య లక్ష్మి కరోనా సమయంలో 2021 మరణించగా నర్సాపూర్లోని ఆమె వర్ధంతి కార్యక్రమం నిర్వహించగా అనిల్ తన అనుచరులతో మధ్యం సేవించి వచ్చి



రవీందర్రెడ్డిని అవమానపర్చినట్లు వ్యవహరించాడు. అదే కార్యక్రమానికి ప్రధాన నిందితులైన పడేపు నాగరాజు, పడేపు నాగభూషణం కూడా హాజరయ్యారు. అనిల్ వ్యవహారాన్ని గమనించిన వీరందరు సమావేశమై ఏలాగైనా అనిల్ ను హతమార్చాలనే పన్నగం వేసుకున్నారు. ఇందులో వారివారి వ్యక్తిగత కారణాలే అనిల్ హతమార్చాలనే సంకల్పాన్ని బలపర్చింది. దీంతో ఈ ముగ్గురు కలిసి మిగతా నలుగురిని సహాయకులుగా నియమించుకుని పక్కా ప్లాన్ ప్రకారం అనిల్ ను హతమార్చారు.












# అక్రమాల జాతర..
# నిబంధనలకు పాతర

## అవినీతికి నిలయంగా కరెంట్ కార్యాలయం



- సంగారెడ్డి డివిజన్ లోనే తిష్ట వేసిన జేఏవోలు
- పోస్టింగ్ ఉత్తర్వులు అడిగితే మౌనం
- వివరాలు అడిగితే ముఖం చాటేస్తున్న వైనం
- 8 నెలలు విధులకు రాకుండానే జీతం
- నాలుగేళ్ళ రికార్డు ఫైళ్లు మాయం
- ఏంఆర్టిలో బయటపడ్డ మరో ఉద్యోగి బాగోతం
- జిల్లా విద్యుత్ శాఖలో రోజుకో అవినీతి బాగోతం
- విచారణ చేస్తున్నామంటూ కాలయాపన
- ప్రతి అవినీతిలో అధికారులకు వాటాలు ఉన్నట్లు అనుమానం
- విద్యుత్ ఉద్యోగులు, యూనియన్లు మొరపెట్టుకున్నా ఫలితం శూన్యం

(సంగారెడ్డి ప్రతినిధి-సిరిన్యూస్) సంగారెడ్డి జిల్లా విద్యుత్ కార్యాలయంలో ఉండవలసిన విద్యుత్ శాఖ జేఏవోల కంటే అదనంగా సంగారెడ్డి డివిజన్లోని తిష్ట వేసి రూరల్ ఏరియా లలో పనిచేస్తే హెచ్ఆర్ఏ తక్కువగా ఉంటుందని, సంగారెడ్డి, పటాన్చెరువు డివిజన్లో పోస్టింగ్ కొరకు విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు ఏఈలు, జేఏవోలు పోటీ పడుతుంటారు. ఒకవైపు యూనియన్ నాయకుల ఒత్తిడితో, మరొకవైపు రాజకీయ ఒత్తిడితో, తమకున్న పలుకుబడిని ఉపయోగించి ఎక్కువ శాతం విద్యుత్ ఉద్యోగులు సంగారెడ్డి, పటాన్చెరు డివిజన్లో విధులు నిర్వర్తించడానికి ఇష్టపడుతుంటారు. సంగారెడ్డి జిల్లాలోని అన్ని డివిజన్ కార్యాలయాలలో విద్యుత్ శాఖలో ఉన్న జేఏవోలను పోస్టింగ్ ఇచ్చే అధికారం జిల్లా ఎస్.ఈ ఆధీనంలో ఉంటుంది. ఖాళీలు ఉన్న డివిజన్లో జేఏవోలను, జిల్లాల నుండి ఇతర ప్రాంతాల నుండి బదిలీపై లేదా డిప్యూటేషన్ పై వచ్చిన జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్ లను జిల్లాలోని అన్ని డివిజన్ కార్యాలయాలలో సమానంగా ఖాళీ ఉన్నోట నియమించాల్సిన అధికారం ఉంటుంది. కానీ నిబంధనలకు విరుద్ధంగా ఖాళీగా ఉన్న జోగిపేట, జహీరాబాద్ డివిజన్ లను వదిలేసి సంగారెడ్డిలోనే లేని పోస్టును క్రియేట్ చేసి విధులు నిర్వహించడం, ఆ ఉద్యోగికి ప్రతినెల జీతాలు చెల్లించడంతో పలు అనుమానాలకు తావిస్తోంది.

### అక్రమార్కులపై కొరడా ఝుళిపిస్తారా ?

సంగారెడ్డి జిల్లా విద్యుత్ ప్రధాన కార్యాలయంలో వరుసగా వస్తున్నటువంటి అవినీతి, అక్రమాలకు సంబంధించిన కథనాలు వెలుగులోకి రావడంతో పలువురు ఆశ్చర్యాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అక్రమార్కులపై కొరడా ఝుళిపించి అవినీతిపరులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. విచారణ పేరుతో కాలయాపన చేయకుండా, అక్రమార్కులకు వత్తాసు పలకకుండా చూడాల్సిన బాధ్యత ఉన్నతాధికారులపై ఉంది. ప్రస్తుత ప్రభుత్వ విద్యుత్ పథకాలను ప్రజలల్లోకి తీసుకెళ్లి ప్రజల మన్ననలు పొందడానికి మెరుగైన సేవలు అందించడానికి కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

### జాబితాలో పేరులేకున్నా విధులు ఎలా ?

సంగారెడ్డి జిల్లా విద్యుత్ శాఖ కార్యాలయంలో ఉన్న జేఏవోల వివరాలను ఇవ్వాలని కోరగా డీఈ టెక్నికల్ శ్రీనివాసులు ఇచ్చిన జిల్లాలోని అన్ని డివిజన్, ఈ ఆర్ ఓ కార్యాలయాలలో పనిచేస్తున్న జేఏఓల జాబితాలో సంగారెడ్డి డివిజన్లో పని చేస్తున్న సిద్దిపేట నుంచి డిప్యూటేషన్‌పై వచ్చిన వ్యక్తి పేరు లేకపోవడం, అతని స్థానంలో ఖాళీగా ఉంచడం పలు అనుమానాలు కలుగుతున్నాయి. డిప్యూటేషన్ పై వచ్చిన వ్యక్తికి సంబంధించిన సంగారెడ్డి డివిజన్లో జేఏవోగా విధులు నిర్వహించడానికి డిప్యూటేషన్ పొడిగిస్తూ ఇచ్చిన ఆర్డర్ కాపీ అందజేయాలని కోరగా.. కోపగించి, దురుసుగా మాట్లాడుతూ ఈ విషయం ఎస్.ఈని అడగాలని, నా దగ్గరికి వచ్చి ఎందుకు అడుగుతున్నారని అసహనం వ్యక్తం చేయడం గమనార్హం. అనంతరం సంగారెడ్డి ఇన్చార్జి డీఈ లక్ష్మన్ ను ఈ విషయమై వివరణ కోరగా ఇప్పుడే నా దృష్టికి వచ్చింది కాబట్టి పూర్వాపరాలు పరిశీలించి పూర్తి వివరాలు అందజేస్తామని అన్నారు. సిద్దిపేట నుండి వచ్చిన జేఏవో డిప్యూటేషన్ పొడిగిస్తూ ఇచ్చిన ఆర్డర్ కాపీ అందజేయాలని కోరగా ఏలాంటి సమాధానం ఇవ్వలేదు.

### జేఏవో పోస్టులు ఇలా...

సంగారెడ్డి జిల్లాలోని సంగారెడ్డి డివిజన్ కార్యాలయాలలో ఉండవలసిన జేఏవోలు ముగ్గురు ఉండాల్సి ఉండగా ప్రస్తుతము ముగ్గురు ఉన్నారు. సంగారెడ్డి ఈఆర్ ఓ కార్యాలయంలో ఉండవలసిన జేఏవోలు 4, ప్రస్తుతమున్నవారు నలుగురు. సదాశివపేట ఈఆర్వో కార్యాలయంలో ఉండవలసిన జేఏవోలు ముగ్గురికి ముగ్గురు ఉన్నారు. పటాన్ చెరు డివిజన్ కార్యాలయంలో ఉండవలసిన జేఏవోలు ముగ్గురికి ముగ్గురు, పటాన్చెరువు ఈఆర్ ఓ కార్యాలయంలో ఉండవలసిన జేఏవోలు ఐదుగురికి, ఐదుగురు ఉన్నారు. కాగా జహీరాబాద్ డివిజన్ కార్యాలయంలో ఉండవలసిన జేఏవోలు ముగ్గురికి ప్రస్తుతం ఇద్దరు ఉండగా ఒకరు డిప్యూటేషన్‌పై వేరే చోటుకు వెళ్లడం జరిగింది. జహీరాబాద్ ఈఆర్ ఓ కార్యాలయంలో ఉండవలసిన జేవోలు నలుగురికి ప్రస్తుతం ఇద్దరుండగా, మరో రెండు పోస్టులు ఖాళీగా ఉన్నవి. జోగిపేట డివిజన్ కార్యాలయంలో ఉండవలసిన జేఏవోలు నలుగురికి ప్రస్తుత ఒక పోస్టు ఖాళీగా ఉంది. జోగిపేట ఈఆర్ ఓ కార్యాలయంలో ఉండవలసిన జేఏవోలు నలుగురికి నలుగురు ఉన్నారు.

### సంగారెడ్డి డివిజన్ లోనే జేఏవోల తిష్ట

సంగారెడ్డి డివిజన్ లో 3 జేఏవోలు, ఈ ఆర్ ఓ కార్యాలయాలలో 4 జేఏవోలు ఉన్నారు. సిద్దిపేట నుండి డిప్యూటేషన్‌పై వచ్చిన ఓ జేఏవోను ఖాళీగా ఉన్న జహీరాబాద్, జోగిపేటలో పోస్టింగ్ ఇవ్వకుండా, సంగారెడ్డి డివిజన్లోనే పోస్ట్ కావాలని లేని పోస్టును క్రియేట్ చేసి ఉన్న వారికంటే అదనంగా జేఏవో పోస్టును కేటాయించారు. అతనికి నెలనెలా జీతాలు ఇవ్వడం జరుగుతుంది. దీనిపై పలు విద్యుత్ ఉద్యోగ సంఘాలు గతంలోనే హెచ్చరించినప్పటికీ అవేవీ పట్టించుకోకుండా పనులు చేయడంపై పలువురు ఉద్యోగులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

### ఎక్కడైనా పోస్టింగ్ ఇచ్చే అధికారం నాకుంది : శ్రీనాథ్, ఎస్ఈ – సంగారెడ్డి



సంగారెడ్డి జిల్లా వీఆర్వో, డివిజన్ కార్యాలయాలలో పనిచేస్తున్న జేఏవోలు ఉండవలసిన పోస్టుల కన్నా ఎక్కువ మంది ఇక్కడ పనిచేస్తున్నారని వివరణ కోరగా అది మా డిపార్ట్మెంట్ అంతర్గత విషయం, వివరాలు మీకు వెల్లడించాల్సిన అవసరం లేదు. ఎస్ఈగా నేను ఎక్కడైనా పోస్టింగ్ ఇచ్చే అధికారం నాకుంది. జహీరాబాద్ జోగిపేటలో జేఏవోల ఖాళీలు ఉన్నాయన్నది వాస్తవమే. గతంలో పనిచేసిన అధికారులు ప్రమోషన్ లో వెళ్లడం వలన అక్కడ ఖాళీలు ఏర్పడ్డాయి. త్వరలో రాబోయే డైరెక్ట్ రిక్రూట్మెంట్ లో వచ్చిన జేఏఓలను ఆ ఖాళీలలో భర్తీ చేస్తామని ఎస్ఈ తెలిపారు. సిద్దిపేట నుంచి డిప్యూటేషన్‌పై వచ్చిన వ్యక్తి పనిచేస్తున్న ప్రస్తుత కార్యాలయ వివరాలు, అతని పోస్టింగ్ ఆర్డర్ కాపీని, డిప్యూషన్ పై వచ్చిన సిబ్బందిని తన ఇష్టం వచ్చిన చోట పోస్టింగ్ ఇవ్వవచ్చనే జీవో ఆర్డర్ కాపీని అందజేయమని అడగగా అది మీకు అవసరం లేని విషయం అని, అది నీకెందుకని సమాధానం దాటవేశారు. ఇటీవలిగా సిరి దినపత్రికలో వరుసగా విద్యుత్ శాఖ అవినీతి అక్రమాలపై వచ్చిన కథనాలకు అట్టి అధికారులపై ఏ చర్యలు తీసుకున్నారని అడగగా దానిపై విచారణ జరుగుతుందని, విచారణ జరుగుతున్న సమయంలో వివరాలు వెల్లడించలేనని, ఒకవేళ విచారణలో అవినీతి జరిగిందని తేలితే శాఖపరమైన చర్యలు తీసుకుంటామని అట్టి వివరాలను మీడియాకు అందజేస్తానని తెలిపారు.





# పెట్రేగుతున్న మైనింగ్ మాఫియా!

## అనుమానాస్పద అనుమతులతో జోరుగా మట్టి దందా

- అంతులేని దోపిడీకి నిదర్శనం
- చెరువులు మాయం.. రోడ్లు ధ్వంసం
- నిబంధనలకు పాతరేసి మట్టి దోపిడీ
- నరకప్రాయంగా నాగుసానిపల్లి రోడ్లు
- పల్లె రోడ్లపై ప్రాణాంతక ప్రయాణం
- కలెక్టర్ అనుమతి ఉందని కాంట్రాక్టర్ సవాల్
- మట్టి మాఫియాకు అడ్డుకట్ట ఎప్పుడు ?
- మామూళ్ళ మత్తులో అధికారులు

(పాపన్నపేట - సిరిన్యూస్) పాపన్నపేట మండల పరిధిలోని శేరిపల్లిలోని కందడివాని కుంటలో పూడికతీత పేరుతో భారీ ఎత్తున మట్టి తవ్వకాలు జరుగుతున్నాయి. నీటి సామర్థ్యం పెంచుకోవడానికి గ్రామ సభ నిర్వహించి నలుగురు సభ్యులతో కూడిన కమిటీని ఏర్పాటు చేశారని చెబుతున్నారు. ఈ కమిటీలో స్థానిక తహశీల్దారు, ఎంపీడీవో, మండల వ్యవసాయ అధికారి, నీటిపారుదల శాఖ ఏఈ ఉన్నారు. వీరి నివేదిక ఆధారంగా మెదక్ జిల్లా అడిషనల్ కలెక్టర్ నగేష్ అనుమతులు ఇచ్చారని ప్రచారం జరుగుతోంది. అయితే ఈ అనుమతులపై జిల్లా కలెక్టర్ కు సమాచారం ఉందా లేదా అనేది ప్రశ్నార్థకంగా మారింది.

### అనుమానాస్పద అనుమతులు...

మట్టి తరలింపుకు ఇచ్చిన అనుమతులలో నిబంధనలను తుంగలో తొక్కినట్లు స్పష్టంగా కనిపిస్తోంది. సాధారణంగా అనుమతి పత్రంలో మట్టి పరిమాణం, తరలించాల్సిన దూరం, కాలపరిమితి, వాహనాల సంఖ్య వంటి కీలక వివరాలు స్పష్టంగా ఉండాలి. పర్యావరణం నుండి స్టేట్ ఎన్విరాన్ ఎన్విరాన్ మెంట్ ఇంపాక్ట్ అసెస్ మెంట్ అథారిటీ, కాలుష్య నియంత్రణ మండలి నుండి కాన్సెంట్ ఫర్ ఆపరేషన్ వంటి అనుమతులు, మినరల్ ట్రాన్సిట్ పాస్ లు వంటి అనుమతులు ఉండాలి. కానీ సదరు అనుమతి పత్రంలో ఇవేవీ లేకపోవడం అనేక అ నుమానాల కు తావిస్తోంది. ఇది కేవలం అక్రమార్జన కోసమే ఇచ్చిన అ నుమ తుల ని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.



### నాగుసాని పల్లి రోడ్లు ధ్వంసం...

క ంద డివాని కుంట నుంచి భారీ టిప్పర్ల ద్వారా మట్టిని పొరుగు మండలం కొల్చారం పరిధిలోని పోతన్ శెట్టిపల్లికి తరలిస్తుండటంతో పల్లె రోడ్లు తీవ్రంగా దెబ్బతింటున్నాయి. నాగుసానిపల్లి బీటీ రోడ్లు పూర్తిగా ధ్వంసం అయ్యాయి. చిన్నపాటి రోడ్లపై అధిక లోడ్‌తో భారీ వాహనాలు నడపడానికి అనుమతి ఉందా అనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. తమ గ్రామం గుండా నిత్యం భారీ వాహనాలు వెళ్లడం వల్ల రోడ్లన్నీ నాశనమవుతున్నాయని నాగుసానిపల్లి గ్రామస్తులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యం వల్ల రోడ్లు అధ్వాన్నంగా మారడంపై స్థానికులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు.

### అధికారుల మధ్య సమన్వయ లోపం.. మైనింగ్ మాఫియాకు వరం

మట్టి అనుమతుల నుంచి తరలింపు వరకు అధికారుల మధ్య తీవ్రమైన సమన్వయ లోపం స్పష్టంగా కనిపిస్తోంది. చెరువు పూడికతీతకు తమకు సంబంధం లేదని మైనింగ్ శాఖ అధికారులు తెలుపడం, అది పూర్తిగా ఇరిగేషన్ శాఖకు సంబంధమని మైనింగ్ శాఖ ఆరోపిస్తోంది. దీనికి బదులిచ్చిన ఇరిగేషన్ శాఖ, మైనింగ్ శాఖకు సంబంధం లేకపోతే చలాన్లు ఎందుకు కట్టించుకుందని ప్రశ్నించడం గమనార్హం. నిరంతరం మట్టి తరలింపును పర్యవేక్షించాల్సిన అధికారులు కనీసం అటువైపు కన్నెత్తి చూడకపోవడం వల్ల ఎంత మట్టి తరలిపోతుందో కూడా లెక్కకు రాకుండా పోతుంది. పగలు, రాత్రి పూట అధిక లోడుతో



వాహనాలు వెళ్లడం వల్ల రోడ్లు విధ్వంసం చేస్తుంటే సంబంధిత శాఖ అధికారులు చర్యలు తీసుకోకుండా ఉండటంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

### కలెక్టర్ అనుమతి ఉంది.. కాంట్రాక్టర్ బరితెగింపు..

మట్టి తరలింపుకు జిల్లా కలెక్టర్ నుంచి అనుమతులు ఉన్నాయని, మమ్మల్ని ఏం చేయలేరని బీఆర్ఎస్ నాయకుడు, కాంట్రాక్టర్ బహిరంగంగా చెబుతున్నాడు. మట్టి తరలింపు కోసం నాలుగు లక్షలు ఖర్చు చేస్తున్నామని, గ్రామంలోని గుడికి, గ్రామ పంచాయతీకి, ప్రభుత్వానికి ఆ డబ్బులు వెచ్చించాం కాబట్టి వ్యాపారం చేసుకుంటామని బరితెగింపుగా అంటున్నాడు. అధికారుల మద్దతు ఉందనడానికి ఇది స్పష్టమైన నిదర్శనం. స్థానిక విలేకరులు వివరణ కోరే ప్రయత్నం చేయగా అధికారులు తలోమాట చెప్పడం ఈ ఆరోపణలకు మరింత బలం చేకూరుతుంది.

### మాఫియాకు అడ్డుకట్ట పడేదెప్పుడు ?

పాపన్నపేట మండలంలో మైనింగ్ మాఫియా నామమాత్రపు నిబంధనలతో ప్రభుత్వ నిబంధనలను పాతరేస్తూ అక్రమార్జనకు పాల్పడుతోంది. లక్షలాది రూపాయల ప్రజాధనం రోడ్ల రూపంలో నాశనం అవుతుంటే, కోట్ల రూపాయల విలువైన మట్టి నిస్సిగ్గుగా తరలిపోతుంటే అధికారులు పట్టించుకోకపోవడంపై ప్రజాగ్రహం వ్యక్తమవుతోంది. ఈ అక్రమ దోపిడీకి అధికారులు ఎప్పుడు అడ్డుకట్ట వేస్తారు? మైనింగ్ మాఫియాకు చరమగీతం పాడి, ప్రజలకు న్యాయం జరిగేదెప్పుడు అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

# అబద్ధపు హామీలతో గద్దెనెక్కారు!

- హామీలను నెరవేర్చని కాంగ్రెస్ కు ఓటు ఎందుకు వేయాలి?
- నాకోసం పనిచేసిన వారిని కాపాడుకుంటా
- వచ్చేది మన ప్రభుత్వమే
- మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు



**సిద్దిపేట ప్రతినిధి,జూలై 21 (సిరి న్యూస్)** బిఆర్ఎస్ పార్టీ కోసం, నాకోసం పనిచేసిన వాళ్లను కాపాడుకుంటానని, వచ్చేది మన ప్రభుత్వమేనని, అబద్ధపు హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ పార్టీకి ఓటు అడిగే నైతిక హక్కు లేదని మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సిద్దిపేట రూరల్ మండల ముఖ్య నాయకుల మీటింగ్ లో ఆయన మాట్లాడుతూ, ఇచ్చిన ఏ హామీని రేవంత్ ప్రభుత్వం నెరవేర్చలేదని, రూ.రెండు లక్షల రుణమాఫీ చేస్తానని యాభై శాతం చెయ్యలేదని... రూ.యాభైవేలు,లక్ష, రెండు లక్షలోపు వాళ్లకు కూడా పూర్తి రుణమాఫీ కాలేదని, పద్దెనిమిది నెలల కాలంలో ఒక్క పింఛన్ కూడా ఇవ్వలేదని, పైగా నిబంధనల పేరుతో రెండులక్షల పింఛన్ లను తొలగించారని ఆరోపించారు. రెండులక్షల ఉద్యోగాలు ఇస్తానని చెప్పి.. పన్నెండు వేల ఉద్యోగాలు ఇచ్చి మోసం చేశాడని,ఎన్నికల ముందు రేవంత్ మాటలు నమ్ముతలేరనే ఉద్దేశంతో రాహుల్ గాంధీ తో హామీ ఇప్పించాడని, ఇప్పుడు రేవంత్, రాహుల్ గాంధీ లు గన్ మెన్ లు లేకుండా అశోక్ నగర్ రావాలని సవాల్ విసిరారు. ఫీజ్ రియంబర్స్ మెంట్ ఇప్పటి వరకు ఒక్క రూపాయి కూడా విడదల చేయలేదని, దీంతో విద్యార్థులు పై చదువులు చదువుకోలేక ఇబ్బందులు పడుతున్నారు, కొందరు విద్యార్థులు చదువు మానేసే పరిస్థితులు వచ్చాయని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలకు ఇరవై ఐదు వందలు ఆడపిల్లలకు స్కూటీలు, కల్యాణ లక్ష్మికి లక్షతో పాటు తులం బంగారం, కెసిఆర్ కిట్టు...ఇలా అన్నీ పథకాలు బందు చేసి అన్ని వర్గాల ప్రజలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని మండిపడ్డారు. మేడిగడ్డలో రెండు పిల్లర్లు కూలితే, కాలేశ్వరం కూలిందని ప్రచారం చేయడం నిజంగా సిగ్గుచేటన్నారు. కాలేశ్వరం కూలితే ఇప్పుడు రంగనాయక సాగర్ కు వచ్చే నీళ్లు ఎక్కడి నుంచి వస్తున్నాయని ప్రశ్నించారు. కాలువల ద్వారా నీలిచ్చి కడుపు నింపిన ఘనత కేసిఆర్ కే దక్కుతుందన్నారు. ఆరు గంటల కరెంటును ఇరవై నాలుగు గంటల కరెంటుగా మార్చిన ఘనత కేసిఆర్ కే దక్కుతుందన్నారు.కెసిఆర్ ప్రభుత్వంలో రైతులకు పదకొండు సార్లు రైతుబంధు వేశారని, కెసిఆర్ రైతును రాజు చేస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను పట్టించుకోకుండా ఎన్నికలు ఉన్నప్పుడే రైతుబంధు వేస్తున్నారని ఆరోపించారు. మనమంతా కుటుంబ సభ్యులం ఒక కుటుంబంలా...కలిసికట్టుగా పని చేద్దాం..ఎట్లుండే తెలంగాణ ఎట్లా అయింది అనేది గ్రామస్థాయిలో ప్రజలకు అర్థమయ్యేలా చర్చలు పెట్టి వివరించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మీ గ్రామాల్లోకి వచ్చే సమన్వయకర్తలను సమన్వయం చేసుకొని పని చేయాలని,మన పార్టీ అభ్యర్థులను గెలిపించుకోవాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

# హాస్టళ్లపై పర్యవేక్షణ ఏదీ?

- కొట్టొచ్చినట్లు కనిపిస్తున్న అధికారుల నిర్లక్ష్యం
- మొర్గి ప్రభుత్వ మోడల్ మోడల్ పాఠశాలలో విద్యార్థులకు ఫుడ్ పాయిజన్
- 11 మంది విద్యార్థులు వాంతులు, విరేచనాలు
- విద్యార్థులను నారాయణఖేడ్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలింపు
- నాణ్యమైన భోజనం అందించడంలో విఫలం
- ప్రభుత్వ ఆదేశాలు భేఖాతర్
- విద్యార్థులను పరామర్శించిన ఎమ్మెల్యే సంజీవరెడ్డి, మాజీ ఎమ్మెల్యే

**నారాయణఖేడ్ జూలై 11 (సిరి న్యూస్):** నారాయణఖేడ్ నియోజకవర్గం నాగలిగిద్ద మండల్ పరిధిలోని మొర్గి ప్రభుత్వ మోడల్ మోడల్ పాఠశాలలో విద్యార్థులకు ఫుడ్ ఫైజన్ జరిగింది.11 మంది విద్యార్థులు వాంతులు విరేచనాలు కావడంతో వాచ్ మెన్ ఆటోలో నారాయణఖేడ్ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లారు. ప్రభుత్వం మంచి సదుద్దేశంతో హాస్టల్లో ఉంటున్న విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించేందుకు కోట్లాది రూపాయలు వెచ్చిస్తున్నప్పటికీ అధికారుల ఆమ్యామ్యాలు పర్యవేక్షణ లోపం వల్ల నాసిరకం భోజనం అందించడంతో విద్యార్థులు ఇబ్బందుల పాలవుతున్నారు. మంచి మాంసం తీసుకుంటే ఎక్కువ డబ్బులు కావాలి ఏవో సచ్చిన కోళ్ల మాంసాన్ని తీసుకొచ్చి విద్యార్థులకు వండిస్తే ఇలానే జరుగుతోందని పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఆ కుళ్ళిపోయిన చికెన్ పొద్దున్న వండవలసి ఉండగ మళ్లీ దాన్ని అలాగే నిలువ పెట్టి రాత్రి 10 గంటలకు వండి విద్యార్థులకు వడ్డించడంతో ఫుడ్ ఫైజన్ అయిందని విద్యార్థులు తెలిపారు. 11 మంది విద్యార్థులు అస్వస్థకు గురై ఆసుపత్రిలో చేరారు.ఆదివారం రాత్రి కుళ్ళిపోయిన చికెన్ తినడం



వల్ల విద్యార్థులు అస్వస్థకు గురయ్యా మన్నారు. పిల్లల సంరక్షణ గాలికి వదిలి వార్డెన్ రాజేశ్వరి, ప్రిన్సిపల్ సువర్ణ, ఇంటికి వెళ్లారన్నారు. పై అధికారుల విజిట్ లోపం వల్లే తరుచు ఇలాంటి సంఘటనలు ఎటో ఒక దగ్గర చోటు చేసుకుంటున్నాయని అయినా ప్రభుత్వం వీరిపై కఠిన చర్యలు తీసుకోవడం లేదని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. విద్యార్థులను ఆసుపత్రిలో పరామర్శించిన ఎమ్మెల్యే సంజీవరెడ్డి.. పలు సంఘాల నాయకులు మెర్గి మోడల్ కళాశాలలో 70 మంది విద్యార్థులు చదువుతున్నారు. పాఠశాల, హాస్టల్ ఒకే చోట ఉండడంతో బాలికలు హాస్టల్లోనే ఉండి చదువుతున్నారు. ఆదివారం చికెను టెండర్ పట్టిన వ్యక్తి మధ్యాహ్నాం 12గంటకు చికెన్ తెచ్చారు. అప్పుడు వండకుండా రాత్రి 9 గంటలకు చికెను కడుగుతున్న సమయంలో దుర్వాసన రావడంతో వండవద్దని విద్యార్థులు వరించినప్పటికీ వంటమనిషి చికెను వండేశారు. రాత్రి 10 గంటలకు చికెన్ భోజనం తిన్న విద్యార్థులు ఫుడ్ ఫైజన్ తో ఆస్వాస్థకు గురయ్యారు. వార్డెన్ రాజేశ్వరి, ప్రిన్సిపాల్ సువర్ణ లేకపోవడంతో విద్యార్థులకు ఆటో లో వాచ్మెన్ రాత్రి నారాయణఖేడ్ ఏరియా ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లారు. హాస్టల్లో కనీసం ఏఎన్ఎం నర్సు లేకపోవడం దారుణం.కరుస్ గుత్తి ఆసుపత్రి దూరం కావడంతో సరిహద్దులో ఉన్న కర్ణాటక చిల్లర్గి గ్రామంలో వైద్యం చేసుకుంటారు. హాస్టల్లో మాత్రం నర్సు లేకపోవడంతో కనీసం రాత్రికి ఒక టాబ్లెట్ కూడా దొరకకపోవడంతో విద్యార్థులు తల్లడిల్లారు. అందులో నలుగురు సీరియస్ గా ఉన్నట్లు తెలిపారు. మిగతా 7 మంది చికిత్స పొందుతున్నారు. నారాయణఖేడ్ ఏరియా ఆసుపత్రికి స్థానిక ఎమ్మెల్యే సంజీవరెడ్డి, విద్యార్థులను పరామర్శించారు. విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్ సూపర్డెంట్ రమేష్ ను కోరారు. ప్రిన్సిపాల్ సువర్ణకు వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని డాక్టర్లకు తెలిపారు.

## విద్యార్థులను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే

ఫుడ్ పాయిజన్ జరిగి చికిత్స పొందుతున్న విద్యార్థులను నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి పరామర్శిం చారు. ఫుడ్ పాయిజన్ కు గల కారణాలను విద్యార్థులకు అడిగి తెలుసుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన నుంచి విద్యార్థులకు ఫుడ్ పాయిజన్,





వైరల్ ఫీవర్ వచ్చిన పట్టించుకునే పాపాన పోలేదన్నారు.అలాగే ఆసుపత్రిలోని చికిత్స పొందుతున్న విద్యార్థులకు ధైర్యం చెప్పి మెరుగైన వైద్యం అందించాలని ఆసుపత్రి వైద్యులకు సూచించారు.

## విద్యార్థులను పరామర్శించిన ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నాగల్ గిద్ద మండల పరిధిలోని మొర్గి గ్రామంలో మాడల్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఫుడ్ పాయిజన్ అయిన సందర్భంగా నారాయణఖేడ్ పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి చికిత్స పొందుతున్న విద్యార్ధినీలను ఎమ్మెల్యే సంజీవరెడ్డి. హుటాహుటిన ఆసుపత్రికి చేరుకొని విద్యార్థులను పరామర్శించి ఫుడ్ పాయిజన్ కు గల కారణాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నరు.అనంతరం ఎమ్మెల్యే విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడుతూ ఫుడ్ పాయిజన్ పై హార తీశారు. అలాగే ఆసుపత్రిలోని చికిత్స పొందుతున్న విద్యార్థులకు ధైర్యం చెప్పి మెరుగైన వైద్యం అందించాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్,రమేష్ సూచించారుఈ కార్యక్రమంలో నాగలిగిద్ద మండల ఎంఈఓ మన్మధ కిషోర్, శంకర్ ముదిరాజ్, పండరి రెడ్డి, ముంతాజ్, మాజీ ఎంపీటీసీలు, గుండె రావు పాటిల్ ఉన్నారు.

# 25 నుండి అన్ని మండల కేంద్రాల్లో రేషన్ కార్డులు పంపిణీ



**సంగారెడ్డి ప్రతినిధి, జులై 21 (సిరి న్యూస్) :** ఈ నెల 25 నుంచి ఆగస్టు 10వ తేదీ లోపు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మండలాలలో రేషన్ కార్డుల పంపిణీ పూర్తి చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి తదితరులతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం సాయంత్రం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లతో సమీక్ష జరిపారు. వర్షాల నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, రేషన్ కార్డుల పంపిణీ, సాగునీటి వనరులు, ఎరువుల పంపిణీ పర్యవేక్షణ, సీజనల్ వ్యాధుల నియంత్రణ తదితర అంశాలపై కలెక్టర్లకు దిశా నిర్దేశం చేశారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు 96 లక్షల 95 వేల 299 రేషన్ కార్డులు ఉన్నాయని సీఎం వెల్లడించారు. గతంలో రేషన్ షాపులు, నిత్యావసర సరుకులపై ప్రజల్లో అంతగా ఆసక్తి ఉండేది కాదని అన్నారు. ప్రస్తుతం సన్న బియ్యం పంపిణీతో రేషన్ కార్డులకు విపరీతమైన డిమాండ్ పెరిగిందని గుర్తు చేశారు. దీనిని దృష్టిలో పెట్టుకొని అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డులు అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందని, ఇది నిరంతర ప్రక్రియ అని స్పష్టం చేశారు. ఇందులో భాగంగానే ఈ నెల 25 నుంచి వచ్చే నెల ఆగస్టు 10 వరకు అన్ని మండల కేంద్రాల్లో అధికారికంగా రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం చేపట్టాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. శాసనసభ్యులు, జిల్లా ఇంచార్జి మంత్రులు రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో విధిగా పాల్గొనాలని సూచించారు. ప్రతీ జిల్లాలో ప్రణాళికాబద్ధంగా రేషన్ కార్డులు పంపిణీ అయ్యేలా కలెక్టర్లు సమన్వయం చేసుకోవాలని అన్నారు. ప్రతీ మండలంలో జిల్లా కలెక్టర్లు, అడిషనల్ కలెక్టర్లు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని సూచించారు. వర్షాల నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ఎక్కడ కూడా ప్రాణ నష్టం, ఆస్తి నష్టం వాటిల్లకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని హితవు పలికారు. జూన్ నుంచి ఇప్పటి వరకు రాష్ట్రంలో సగటున 21 శాతం వర్షపాతం తక్కువగా నమోదైనప్పటికీ, గత మూడు రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయని అన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకొని అన్ని విభాగాలను అప్రమత్తం చేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూడాలన్నారు. వాతావరణ సూచనలకు అనుగుణంగా రైతులను, వివిధ వర్గాల ప్రజలను ముందుగానే అప్రమత్తం చేయాలన్నారు. పోలీస్ కమిషనరేట్లకు సంబంధించిన ఉన్నతాధికారులు కూడా క్షేత్రస్థాయిలో ఉంటూ పరిస్థితులను పర్యవేక్షించాలని సూచించారు. జిల్లాల్లో పిడుగుపాటుతో జరిగే నష్టాల వివరాలు సత్వరమే నమోదు చేస్తూ, బాధిత కుటుంబాలకు పరిహారం అందేలా చూడాలన్నారు. వర్షాల వల్ల ప్రజలు, ప్రత్యేకించి గిరిజన ప్రాంతాల్లో అంటు వ్యాధుల బారిన పడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని హితవు పలికారు. అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో, ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యులు ఎల్లవేళలా అందుబాటులో ఉండేలా పర్యవేక్షణ చేయాలని కలెక్టర్లకు సూచించారు. పశువులకు సంబంధించి వెటర్నరీ విభాగం కూడా అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆసుపత్రులను కలెక్టర్లు ఆకస్మిక తనిఖీలు చేయాలని ఆదేశించారు. కలెక్టర్లు ఖచ్చితంగా క్షేత్రస్థాయి పర్యటనలు జరపాలని సూచించారు. వర్షాలను దృష్టిలో ఉంచుకుని సాగునీటికి సంబంధించి నీటి యాజమాన్య పద్ధతులను సమర్ధవంతంగా నిర్వహించేలా కార్యాచరణ రూపొందించుకోవాలని అన్నారు. యూరియా నిల్వలకు సంబంధించి ప్రతీ ఎరువుల దుకాణం దగ్గర స్టాక్ వివరాలను బోర్డుపై తప్పనిసరిగా ప్రదర్శించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. స్టాక్ వివరాలు ఆన్ లైన్ లో నిశిత పరిశీలన చేయాలని అన్నారు. ఎరువుల కొరత ఉన్నట్లు కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారని, నిజానికి రాష్ట్రంలో రైతుల అవసరాలకు సరిపడా యూరియా సహా ఇతర ఎరువుల నిల్వలు అందుబాటులో ఉన్నాయని, ఎరువుల విషయంలో రైతులు ఆందోళనకు గురి కావాల్సిన అవసరం లేదని ముఖ్యమంత్రి భరోసా కల్పించారు. అయితే యూరి యా నిల్వలను ఇతర వ్యాపార అవసరాలకు మళ్లించకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. యూరియాను పక్కదారి పట్టించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఎంతటి వారినైనా ఉపేక్షించవద్దని అన్నారు. రైతుల ప్రయోజనాల కంటే తమ ప్రభుత్వానికి ఏదీ ముఖ్యం కాదని సీఎం స్పష్టం చేశా రు. ఎరువుల పంపిణీకి సంబంధించి ఫిర్యాదుల కోసం ప్రత్యేకంగా టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేయాలన్నా రు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో ఈ జిల్లా కలెక్టర్ పి ప్రావీణ్య, అదనపు కలెక్టర్ ( రెవెన్యూ) మాధురి, జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్, జిల్లా వైద్యాధికారిణి గాయత్రీ దేవి, డిసిహెచ్ఓ సంగారెడ్డి, ఇరిగేషన్ డి ఈ భీమ్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

- యూరియా పక్కదారి పట్టకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలి
- సీజనల్ వ్యాధుల నియంత్రణకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి
- భారీ వర్షాల వల్ల ప్రాణ, ఆస్తినష్టం వాటిల్లకుండా అప్రమత్తంగా వ్యవహరించాలి
- జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ లో సీఎం రేవంత్ రెడ్డి







**సిద్దిపేట ప్రతినిధి, జూలై 21 (సిరి న్యూస్)** 25 నుంచి ఆగస్టు పద్నాలుగు వరకు మండల కేంద్రాలలో రేషన్ కార్డుల పంపిణీ చేయాలని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. సోమవారం వానాకాలం సాగు, భారీ వ ర్షాలు, సీజనల్ వ్యాధుల నియంత్రణ, రేషన్ కార్డుల పంపిణీ వంటి పలు అంశాల పై సీఎం రేవంత్ రెడ్డి, రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తం కుమార్ రెడ్డి, మంత్రి వర్యులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి ,పొన్నం ప్రభాకర్, దామోదర్ రాజనర్సింహ, వివేక్ వెంకట స్వామి, వాకాటి శ్రీహరి, సీతక్క, శ్రీధర్ బాబు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రామ కృష్ణా రావు హైదరాబాద్ లోని ముఖ్యమంత్రి కార్యాల యం నుంచి అన్ని జిల్లా కలెక్టర్ లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్లు గరీమ అగ్ర వాల్, అబ్దుల్ హమీద్ లతో కలిసి జిల్లా కలె క్టర్ కే.హేమావతి పాల్గొన్నారు. సీఎం రేవం త్ రెడ్డి మాట్లాడుతూ, గత ఏడాది ఖమ్మం జిల్లాలో మూడు గంటల వ్యవధిలో ముప్పై తొమ్మిది సెంటీ మీటర్ల భారీ వర్షం పడిందని, ప్రస్తుతం కూడా అటువంటి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని సీఎం రేవంత్ కలెక్టర్ లను ఆదేశించారు. అనంతరం సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన ఆదేశాలను తూ.చ తప్పకుండ జిల్లా, మండల, గ్రామ స్థాయి అధికారులు పాటించాలన్నారు. జిల్లా లో ఉన్న ఫర్టిలైజర్ షాప్ లకు రెవిన్యూ, పోలీస్ అధికారులను నియమించే విధంగా వివరాలు ఇవ్వాలిసిందిగా వ్యవసాయ అధికారికి తెలిపారు. రేషన్ కార్డులు ఇంకా ఎన్ని పంపిణి చేయాలిసి ఉన్న వివరాలను ఇవ్వాలని సివిల్ సప్లై అధికారులకు తెలిపారు. ఇరిగేషన్ కి సంబందించి చెరువుల నీటి నిల్వల వివరాలను రోజువారీగా సమర్పించాలన్నారు. వర్షాలకు సంబందించి ఆర్డీవో, తహసీల్దార్ లు అప్రమత్తంగా ఉండి..రోడ్ డ్యామేజ్ జరగకుండా, కాలువలు తెగకుండా,వరదల వల్ల ఎలాంటి ప్రాణ,ఆస్తి నష్టం జరగకుండా చూడాలన్నారు.ఈ వీడియో కాన్ఫరెన్స్లో అగ్రికల్చర్, హార్టికల్చర్, సివిల్ సప్లై , ఇరిగేషన్, వైద్య ఆరోగ్య శాఖ తదితర శాఖలకు చెందిన జిల్లా అధికారులు పాల్గొన్నారు.

Published by **Badhe Jayasree** on behalf of **Siri Media**. Published at Flat No. 104, Kapil Kausalya Apartment, Shilpa Cereny County Vencher, Near MBR Garden, Pothireddypally X Road, Sangareddy, Telangana State - 502201. Phone : **9697889922**. E-Mail : **siridailynews@gmail.com**.

# బోనమెత్తిన పటాన్ చెరు



- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ఆధ్వర్యంలో భారీ ఫలహారం బండి ఊరేగింపు
- గల్లిగల్లిలో బోనాల పండుగ వాతావరణం
- భారీ సంఖ్యలో కళారూపాలు
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు
- బోనం సమర్పించిన ఎమ్మెల్యే జీఎంఆర్ కుటుంబ సభ్యులు
- అమ్మవారి కరుణాకటాక్షాలతో ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలి
- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

**పటాన్ చెరు, జూలై 21 (సిరి న్యూస్) :** పటాన్ చెరు లో ఆషాడమాసం బోనాల సంబురాలు అంబరాన్నంటాయి. పట్టణం లోని ప్రతి అమ్మవారి ఆలయం భక్తులతో కిటి కీటలాడింది. పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని మహంకాళి అమ్మవారి దేవాలయం నుండి భారీ ఫలహార బండి ఊరేగింపు కార్యక్రమం నిర్వహిం చారు. వందలాది మంది కళాకారులు, పోతు రాజులు, శివ సత్తుల పూనకాలతో ప్రజలం దరూ భక్తి పారవశ్యంలో మునిగిపోయారు. ఎమ్మెల్యే జిఎంఆర్ కొద్దిసేపు నృత్యం చేసి అందరిని ఉత్సాహపరిచారు. ఆషాడ మాస బోనాల పండుగ సందర్భంగా పటాన్చెరువు పట్టణంలోని వివిధ కాలనీలో గల అమ్మవారి దేవాలయాలను ఎమ్మెల్యే జిఎంఆర్ దర్శించు కున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జిఎంఆర్ కుటుంబ సభ్యులు అమ్మ వారికి బోనం సమ ర్పించారు. బోనాల పండుగను పురస్కరించు కొని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి సతీమణి యాదమ్మ, కుటుంబ సభ్యులు ఏడుగుల్ల పోచమ్మ దేవాలయంలో బోనం సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ అమ్మవారి కరుణాక టాక్షాలతో, ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, ఉండాలని కోరుకు న్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, గూడెం మధుసూదన్ రెడ్డి, గుమ్మడిదల మాజీ జడ్పీటీసీ కుమార్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు నరసింహారెడ్డి, సిఐ వినాయక్ రెడ్డి, గూడెం విక్రమ్ రెడ్డి, గూడెం సంతోష్ రెడ్డి, గూడెం సందీప్ రెడ్డి, మాజీ ప్రజాప్రతినిధులు, జిఎంఆర్ యువసేన సభ్యులు పాల్గొన్నారు.

## మల్లికార్జున్ ఖర్గే 83వ జన్మదినోత్సవం



**నారాయణఖేడ్ జూలై 21 (సిరి న్యూస్) :** ఏఐసిసి అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే జన్మదినం సోమవారం ఖేడ్, పట్టణంలోని కీర్తిశేషులు దివంగత మాజీ ఎమ్మెల్యే పట్లోల కిష్టారెడ్డి, నివాసంలో ఏఐసీసీ అధ్యక్షులు మల్లిఖార్జున్ ఖర్గే 83వ జన్మదినోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో. ముఖ్య అతిథిగా రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు పట్లోళ్ల చంద్రశేఖర్ రెడ్డి, పాల్గొని కేక్ కట్ చేసి మల్లికార్జున్ ఖర్గే నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు ఉండాలని ఆయన అన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గం కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

## గంజాయి పట్టివేత



**కోహిర్ జూలై 21 (సిరి న్యూస్)** మధ్యాహ్నం 12:00 గంటలకు దిగ్వాల్ గ్రామ శివారులోని నయారా పెట్రోల్ పంప్ ముందు వాహనాలు తనిఖీ చేయగా ఒక స్ప్లెండర్ బైక్ నేం AP23AM6521 గలదాన్ని ఆపి తనికి చేయగా బైక్ రైడర్ మంగలి రవీందర్ తండ్రి మాణిక్ R/o దప్పూరు గ్రామం న్యాల్కల్ మండల్ అనునతడి వద్ద 400 గ్రాముల ఎండు గంజాయి లభించింది. శ్రీ. సతీష్ SIP కోహీర్ PS గారు కేసు నమోదు చేసి నిందితున్ని జ్యుడీషియల్ రిమాండ్ కు పంపడమైనది.

# వర్షం కోసం చప్తాకే గ్రామస్తుల జలాభిషేకం



**నారాయణాఖేడ్ జూలై 21 (సిరి న్యూస్) :** ఖేడ్,మండల పరిధి లోని చప్తా కే గ్రామంలో డప్పు చప్పులతో ఇంటికో మహిళ నిండు బిందెలతో గ్రామ దేవతలకు నీటితో జలాభిషేకం చేశారు. వర్షాకాలం ప్రారంభమై నెల 15 రోజులు కావస్తున్న వర్షాలు సమృద్ధిగా కురవక పంటలు ఎండిపోతున్న నేపథ్యంలో, చప్తా కే గ్రామస్తులు దైవ అనుగ్రహం కోసం భక్తిశ్రద్ధలతో గ్రామంలోనీ హనుమాన్ మందిరంలో విగ్రహానికి జలాభిషేకం నిర్వహించారు. గ్రామంలోని ప్రతి గడప నుంచి మహిళ ఒక బిందెతో నీటిని తీసుకువచ్చి 500 బిందెల నీటితో ఆంజనేయ స్వామికి జలాభిషేకం నిర్వహించారు.అంతకు ముందు మహాలింగేశ్వరుడికి, శివాజీ మహారాజు, బొమగొండేశ్వరుడు, మహాత్మా బాసవేశ్వరుడు, భూలక్ష్మి అమ్మవారు, పోచమ్మ తల్లి, దుర్గమ్మ తల్లి గ్రామంలో దేవతలకు నీటి బిందెలతో అభిషేకం నిర్వహించారు. గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు పెద్ద ఎత్తున పాల్గొని వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు పచ్చగా పండాలని ప్రార్థించారు.




# గెస్ట్ ఫ్యాకల్టీకి దరఖాస్తుల ఆహ్వానం

**జహీరాబాద్ జూలై 21 (సిరి న్యూస్) :** జహీరాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ముహమ్మద్ అస్లాం ఫరూఖీ ప్రెస్ నోట్ ప్రకారం, కాలేజియేట్ ఎడ్యుకేషన్ కమిషనర్ తెలంగాణ 25-26 విద్యా సంవత్సరానికి డిగ్రీ కళాశాలల్లో తాత్కాలిక లెక్చరర్ల గెస్ట్ ఫ్యాకల్టీ సేవలకు నోటిఫికేషన్ జారీ చేశారు. జహీరాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అందించే సబ్జెక్టులు ఇంగ్లీష్ (01), హిందీ (01), ఉర్దూ (01), కామర్స్ ఇంగ్లీష్ మీడియం (01), కామర్స్ ఉర్దూ మీడియం (02), హిస్టరీ తెలుగు మీడియం (01), ఎకనామిక్స్ ఉర్దూ మీడియం (01), పొలిటికల్ సైన్స్ ఉర్దూ మీడియం (01), బోటనీ ఉర్దూ మీడియం (01), జువాలజీ ఉర్దూ మీడియం (01), కెమిస్ట్రీ ఇంగ్లీష్ మీడియం (01), కెమిస్ట్రీ ఉర్దూ మీడియం (01), కంప్యూటర్ సైన్స్ మరియు అప్లికేషన్ (01) తాత్కాలిక ప్రాతిపదికన బోధన గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టుకు గెస్ట్ ఫ్యాకల్టీ నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నరు. జనరల్ అభ్యర్థులకు సంబంధిత సబ్జెక్టులో కనీసం 55% మార్కులు, ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులకు 50% మార్కులు ఉండాలి. పీహెచ్‌డీ నెట్, శాట్, స్లేట్ అభ్యర్థులకు బోధన అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడుతుంది. ఎంపికైన అభ్యర్థులు సంబంధిత భాషలో మాత్రమే బోధించాలి. ఎంపికైన అభ్యర్థుల సేవలు విద్యా సంవత్సరం చివరి వరకు మాత్రమే తీసుకోబడతాయి. ఆసక్తిగల అభ్యర్థులు తమ టైప్ చేసిన దరఖాస్తును వారి వ్యక్తిగత విద్యా వివరాలతో పాటు ఫోన్ నంబర్ మరియు పోస్ట్ గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్ల కాపీలను జూలై 23న సాయంత్రం 2 గంటలలోపు జహీరాబాద్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల కార్యాలయంలో స్వయంగా సమర్పించాలి. ఇంటర్వ్యూ జూలై 24న ఉదయం 10 గంటలకు సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ కళాశాలలో జరుగుతుంది.ఒరిజినల్ సర్టిఫికెట్స్ తో హాజరు కాగలరు.

# దేశీ చాయి స్టాల్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి



**వెల్దుర్తి జులై 21(సిరి న్యూస్):** మండల కేంద్రంలో సోమవారం దేశి ఛాయి స్టాల్ ను ప్రారంభించిన నర్సాపూర్ నియోజకవర్గ శాసనసభ్యురాలు వాకిటి సునితా లక్ష్మా రెడ్డి, ప్రారంభోత్సవం అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికలకు ముందు కామారెడ్డి బీసీ డిక్లరేషన్ పేరిట హామీ ఇచ్చి 42% రిజర్వేషన్ అమలు చేయకుండా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించకుండా ఈ ప్రభుత్వం బీసీలను వంచిస్తుందని ఆమె విమర్శించారు.. ఈ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రతి రైతుకు పూర్తిస్థాయి రుణమాఫీ చేస్తామని నమ్మించి గద్దెనెక్కిన తర్వాత కొందరికి రుణమాఫీ చేసి చేతులు దులుపుకున్నారు తప్పితే పూర్తి స్థాయిలో రుణమాఫీ చేయలేకపోయారు మరియు ఎకరాకు 7500 రైతు భరోసా వేస్తామని రెండు పంటల రైతు భరోసా ఎగ్గొట్టి ఇప్పుడు స్థానిక సంస్థల ఎన్నికల్లో లబ్ది పొందాలని ఆధారబాదరగా అందరికీ రైతు భరోసా ఇచ్చారు ఒకప్పుడు చెట్లకు గుట్టలకు పుట్టలకు రైతుబంధు ఇస్తున్నాడు కేసీఆర్ అని విమర్శించిన వారు మరి ఇప్పుడు ఎందుకు అందరికీ రైతు భరోసా ఇచ్చారన్నారు.. వర్షాకాలం ప్రారంభ సమయంలో పచ్చిరొట్ట విత్తనాల నుండి నేటి ఎరువుల వరకు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా కానీ ప్రభుత్వం మొద్దు నిద్ర పోతుంది తప్పితే రైతుల గురించి ఆలోచించడం లేదు సకాలంలో నాట్లప్పుడు ఎరువులు దొరకక రైతులు ఇబ్బంది పడుతున్న కానీ సరిపడా ఎరువులు అందుబాటులో ఉంచలేక పోతుంది ఈ ప్రభుత్వం ఇప్పటికీ కూడా ఎరువుల కోసం రైతులు ఆధార్ కార్డులు చెప్పులు పెట్టుకునే లైన్లో నిలబడ్డ కానీ కనీసం ప్రభుత్వం స్పందించడం లేదు అని ఆమె మండిపడ్డారు.ప్రతిపక్ష ఎమ్మెల్యేలకు కనీస విలువ ఇవ్వకుండా ప్రోటోకాల్ పాటించకుండా ఓడిపోయిన అభ్యర్థులకు ప్రాధాన్యత ఇస్తూ వాళ్ల చేత కార్యక్రమాలు చేస్తూ నియోజకవర్గ ఎమ్మెల్యేలను అవమానిస్తున్నారు అని అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల, భూమి పూజలు మరియు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్,చెక్కులు కూడా అధికారికంగా ఓడిపోయిన అభ్యర్థులు లబ్దిదారులకు ఇస్తూ అసత్య ప్రచారాలు చేస్తున్నారు ఇదేనా మీ ప్రజా పాలన కనీసం మంత్రుల పర్యటన ఉన్నప్పుడు కూడా ప్రతిపక్ష ఎమ్మెల్యేలకు సమాచారం ఇవ్వకుండా కార్యక్రమాలు చేయడం పద్ధతేనా అని ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రభుత్వం ను ప్రశ్నించారు. నర్సాపూర్ నియోజకవర్గంలో చిలిపిచేడ్ కొల్చారం మండలాలకు సింగూర్ నీళ్లు విడుదల చేస్తే గణపురం అ యకట్ట పూరిస్థాయిలో నింపి రైతులకు నీళ్లు ఇవ్వాలి మరియు కొండపోచమ్మ సాగర్ ద్వారా హల్దీ ప్రాజెక్టులోకి నీళ్లు వదిలి వెల్దుర్తి,కొల్చారం, మండలాలకు అటు మెదక్, నియోజకవర్గ చెందిన రైతులకు నీళ్లు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేయడం జరిగింది.. ఈ కార్యక్రమంలో వెల్దుర్తి మండల అధ్యక్షుడు పంచభూపాల్ రెడ్డి మాజీ జడ్పిటిసి రమేష్ గౌడ్ వెల్దుర్తి మాజీ సర్పంచ్ వెన్నవరం మోహన్ రెడ్డి, మెదక్ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కోదండ కృష్ణ గౌడ్,జెగ్గ అశోక్ గౌడ్,వెన్నవరం శ్రీనివాస్ రెడ్డి, చల్ల మహేష్, రమేష్ చందర్, మాజీ సర్పంచులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.




# కాంగ్రెస్ నుండి బీఆర్ఎస్‌లోకి చేరికలు

- టీపీసీసీ సోషల్ మీడియా ఇన్‌చార్జితోపాటు 15 మంది చేరిక
- హామీల అమలులో కాంగ్రెస్ విఫలం
- ఎమ్మెల్యే సునీత రెడ్డి

**కౌడిపల్లి జూలై 21 ( సిరి న్యూస్)** కౌడిపల్లి మండలం కేంద్రం లో సోమవారం నర్సాపూర్ ఎమ్మెల్యే వాకిటి సునీత లక్ష్మారెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీ నుండి బి ఆర్ ఎస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. సునీత రెడ్డి పార్టీ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ పార్టీ మాయ మాటలు చెప్పి ప్రజలకు ఇచ్చిన వాగ్దానం నెరవేర్చుకోకపోవడంతో కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి తిరిగి సొంత గూటికి బి ర్ స్ లో వచ్చినట్లు రామాంజనేయులు తెలిపారు. నిబద్ధతగా పార్టీ ఆదేశాలను పాటిస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని అన్నారు. ఆంజనేయులు తో పాటు పాటు మరో 15 మంది బిఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా సునీత రెడ్డి మాట్లాడుతూ హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని అందుకే టిఆర్ఎస్ పార్టీలో చేరికలు అన్నారు అనంతరం లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు.. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు సారా రామ గౌడ్ , పార్టీ పెద్దలు దుర్గ రెడ్డి మాజీ సర్పంచ్ ఎల్లమయ్య ,,మాజీ ఎంపీపీ రాజు నాయక్ జడ్పిటిసి కవిత అమర్ సింగ్, మాజీ సర్పంచులు కాంతారావు, నాయి కోటి రాజు మాజీ ఎంపీటీసీ ల ఫోరమ్ అధ్యక్షులు గుంజరి ప్రవీణ్ కుమరకుమార్, సలీమ్ ,రాజు యువ నాయకులు పోలా నవీన్ కుమార్ ,మంగళ పర్తి సందీప్ కుమార్ ,సోషల్ మీడియా కోఆర్డినేటర్లు సారా ప్రతాప్ గౌడ్, రవి సాగర్ శేఖర్ ,మహబూబ్ ఆంజనేయులు వెంకటరావుపేట్ గ్రామ పార్టీ అధ్యక్షులు కుత్బుద్దీన్, నాయకులు పోచయ్య శ్రీనివాస్, శ్రీకాంత్, వెంకటేష్ వెంకటేష్ గౌడ్, చెంబుని రాజు, నాగరాజు, పోచయ్య, శ్రీకాంత్ పాల్గొన్నారు.

# డిఫెన్స్ కాలనీలో ఫలహారం బండి ఊరేగింపు వేడుకలు

- హాజరైన గూడెం మహిపాల్ రెడ్డి





**పటాన్ చెరు, జూలై 21 (సిరి న్యూస్):** పటాన్చెరు పట్టణ పరిధిలోని కృషి డిఫెన్స్ కాలనీలో పోచమ్మ తల్లి దేవాలయం బోనాల పండుగ సందర్భంగా ఆదివారం రాత్రి ఏర్పాటు చేసిన ఫలహారం బండి ఊరేగింపు కార్యక్రమంలో స్థానిక ఎం ఎల్ ఏ గూ డెం మహిపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనతో పాటు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, కాలనీ అధ్యక్షులు అమరేందర్, మాజీ అధ్యక్షులు మాణిక్ రెడ్డి, అసోసియేషన్ ప్రతినిధులు, మొగిలి మాల, రాంచందర్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

# బోనాల వేడుకల్లో ఎమ్మెల్యే సతీమణి



**నారాయణఖేడ్ జూలై 21 (సిరి న్యూస్) :** నారాయణఖేడ్ పట్టణంలోని నియో ప్రగతి ఉన్నత పాఠశాల బోనాల వేడుకలలో పాల్గొన్న ఎమ్మెల్యే సతీమణి అనుపమా సంజీవరెడ్డి, ఖేడ్, పట్టణంలోని నియోప్రగతి ఉన్నత పాఠశాలలో నిర్వహించిన బోనాల వేడుకలలో ఎమ్మెల్యే సతీమణి అనుపమా సంజీవ రెడ్డి. పాల్గొని ఆషాడ మాస బోనాల పండుగ సందర్భంగా విశిష్టత విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు అందరిని ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కె.ప్రకాష్, కరస్పాండెంట్ కె.వెంకటరత్నం, ఉపాధ్యాయ బృందం మరియు పోషకులు పాల్గొన్నారు.

# సెల్ఫీ వీడియోతో విద్యార్థి ఆత్మహత్య



**సంగారెడ్డి ప్రతినిధి, జులై 21 (సిరి న్యూస్):** సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండల పరిధిలోని వోక్సెన్ యూనివర్సిటీలో ఆర్క్ టెక్చర్ సెకండ్ ఇయర్ చదువుతున్న రుషికేష్(19) ఆదివారం రాత్రి క్యాంపస్ రూమ్ లో ఫ్యాన్ కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. హైదరాబాద్ లోని సరూర్ నగర్ కు చెందిన రుషికేష్ వోక్సెన్ యూనివర్సిటీలో చదువుకుంటూ గత మూడు రోజుల క్రితం ఫ్రెండ్స్ తో కలిసి విహార యాత్రకు వెళ్లి వచ్చాడు. కాగా ఆత్మహత్యకు ముందు విద్యార్థి సెల్ఫీ వీడియో తీసుకున్నట్లు తెలిసింది. అందులో నా అనుకున్న వాళ్లందరూ దూరం అవుతున్నారు.. సెల్ఫీ వీడియోతో విద్యార్థి ఆత్మహత్య..అమ్మా ఐ లవ్ యూ.. అక్క ఐ లవ్ యూ అని సెల్ఫీ వీడియో తీసుకున్నాడు. ఆత్మహత్యకు ముందు సెల్ఫీ వీడియో తీసుకున్న విద్యార్థి కి సంబంధించిన మొబైల్ ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అదే విధంగా తన కుటుంబంలో ఆర్థిక ఇబ్బందులు, నీ వద్ద వ్యక్తిగత కారణాలు ఉండటంతో ఏమి చేయాలో తోచక సెల్ఫీ వీడియో తీసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటుదాం



- **బీజేపీ ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్**

**మెదక్ కలెక్టరేట్ జులై 21 ( సిరి న్యూస్)** భారతీయ జనతా పార్టీ మెదక్ జిల్లా స్థానిక సంస్థల ఎన్నికల కార్యశాల మెదక్ జిల్లా బిజెపి పార్టీ అధ్యక్షులు వాల్దాస్ రాధా మల్లేష్ గౌడ్ అధ్యక్షతన సోమవారం పార్టీ కార్యాలయం లో నిర్వహించరు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఉప్పల్ మాజీ శాసనసభ్యులు NVSS ప్రభాకర్ హాజరై మాట్లాడుతూ. స్థానిక సంస్థల ఎన్నికల్లో బిజెపి చేసినటువంటి అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని సూచించారు.అదేవిధంగా గ్రామ పంచాయతీల్లో కానీ పురపాలక శాఖలలో కానీ మండలాలలో కానీ కేంద్ర ప్రభుత్వ నిధులతోనే అభివృద్ధి జరుగుతుందని తెలిపారు. హామీలు తప్ప ఆచరణలో లేని కాంగ్రెస్ ఈ రాజ్యాంగ పుస్తకం పట్టుకొని తిరిగే రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి. మంత్రులు కూడా రాజ్యాంగ పుస్తకాన్ని పట్టుకొని ఓట్లు అడుగుతున్నారు తప్ప, రాజ్యాంగ సవరణ చేసి ఐదు సంవత్సరాలకు ఒకసారి అన్నిస్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలనే దానికి మాత్రం వత్తాసు పలకరు.ఇంకో కొత్త డ్రామా ఆడుతూ బీసీలకు రిజర్వేషన్లు పెంచామని పెంచినటువంటి రిజర్వేషన్ల ఆధారంగానే ఎలక్షన్లు జరుపుతామని చెబుతూ సంవత్సరం నుండి కాలయాపన చేస్తున్నా కాంగ్రెస్ పార్టీ పై మండిపడ్డారు. గ్రామాల్లో జరిగే అభివృద్ధి అంత కేంద్ర నిదులే.. గ్రామాల్లో సిసి రోడ్లు,స్మశాన వాటికలు, గ్రామపంచాయతీ భవనాలు, వీధిలైట్లు, హరితహారం ఇలా చెప్పుకుంటూ పోతే అనేక అభివృద్ధి కార్యక్రమాలు కేంద్ర ప్రభుత్వ నిధుల నుండి అభివృద్ధి జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా అధ్యక్షులు గడ్డం శ్రీనివాస్. జిల్లా ప్రధాన కార్యదర్శిలు MLN రెడ్డి.సిహెచ్ శ్రీనివాస్. స్థానిక సంస్థల ఎన్నికల జిల్లా కన్వీనర్ పెద్ద రమేష్ గౌడ్.రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ రాగి రాములు. జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్. శ్రీనివాస్. జనగామ ప్రబారి నందా రెడ్డి.యువ మోర్చా జిల్లా అధ్యక్షుడు సతీష్.అసెంబ్లీ కన్వీనర్ మధుసూదన్.జిల్లా కార్యవర్గ సభ్యులు బాలరాజు.దళిత మోర్చా జిల్లా అధ్యక్షులు మహిపాల్. మహిళా మోర్చా మల్లిక. గిరిజన మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి రాములు నాయక్. కిసాన్ మోర్చా నాయకులు మల్లారెడ్డి. జిల్లా పదాధికారులు, రాష్ట్రస్థాయి నాయకులు, మండలాల అధ్యక్షులు, మండల ప్రభారీలు, శక్తి కేంద్రం ఇన్చార్జులు, మండలాలలో జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచులుగా పోటీ చేయాలనుకునే బిజెపి నాయకులు. కార్యకర్తలు. తదితరులు పాల్గొన్నారు.



# మహంకాళి అమ్మవారి, పలహారం బండి ఊరేగింపు

- **పాల్గొన్న మాజీ మంత్రి హరీష్ రావు**



**చేగుంట జూలై 21 (సిరి న్యూస్)** చేగుంట పట్టణ కేంద్రం లో గల మహంకాళి,అమ్మవారి రెండవ వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా, డిష్ రాజ్ ఆధ్వర్యంలో నిర్వహించబడిన, పలహార బండి రథోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ మంత్రి హరీష్ రావు, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, మెదక్ జిల్లా బిఆర్ఎస్ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే పద్మ దేవేందర్ రెడ్డి, ఈ కార్యక్రమం లో బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు నారాయణరెడ్డి, తాజా మాజీ జడ్పీటీసీ,సొసైటీల చైర్మన్లు,వైస్ చైర్మన్లు,తాజా మాజీ సర్పంచ్ పోరం అధ్యక్షులు,చేగుంట మండల తాజా మాజీ సర్పంచులు,ఎంపీటీసీలు,ఉప సర్పంచులు,సొసైటీ డైరెక్టర్లు వివిధ గ్రామల అధ్యక్షులు, ఉప అధ్యక్షులు, మండల యూత్ అధ్యక్షులు, ఉపాధ్యక్షుల, బూత్ అధ్యక్షులు,వివిధ గ్రామాల యూత్ అధ్యక్షులు, పార్టీ కార్యకర్తలు,యువకులు తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు సన్నవడ్ల బోనస్ చెల్లించాలి

- **పోగుల రాజు**



**చిన్నశంకరంపేట జూలై 21 (సిరి న్యూస్) :** చిన్న శంకరం పేట మండల కేంద్రంలో బిజెపి మండల అధ్యక్షుడు పోగుల రాజు మాట్లాడుతూ రైతులకు సన్నవడ్ల బోనస్ వెంటనే చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు, లేనిపక్షంలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేస్తామని అలాగే కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులను ఎక్కడికి అక్కడ అడ్డుకుని నిలదీస్తామని హెచ్చరించారు. ఇట్టి కార్యక్రమంలో బిజెపి జిల్లా నాయకుడు సురేష్ గౌడ్, పట్టణ అధ్యక్షుడు ఆకుల రాజు, ఓబీసీ అధ్యక్షుడు తాళ్ళ శివ శంకర్, యువమోర్చ నాయకుడు మధు, బూత్ అధ్యక్షులు కిషోర్ మరియు ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు,

# చోరికి గురైన మొబైల్ రికవరీ



**పెద్ద శంకరంపేట్ జులై 21 (సిరి న్యూస్)** పెద్ద శంకరంపేట్ మండల్ పరిధిలోని గ్రామాలకు చెందిన సెల్ ఫోన్లు చోరీకి గురైన పోగొట్టుకున్న బాధితులకు సోమవారం నాడు రికవరీ చేసిన ఫోన్లను బాధితులకు అందజేసిన శంకరంపేట్. ఎస్ ఐ. సోమవారం సీట్ పోర్టల్ ద్వారా ట్రేస్ ఔట్ చేసిన 11 సెల్ ఫోన్ లను పోగొట్టుకున్న ఓనర్స్ శివాజీ దాదావత్, విష్ణు వర్ధన్ రెడ్డి,అంజయ్యా , లక్ష్మణ్,విఠల్, సుల్తాన్, ఆగమయ్య ,సాయిలు,బాగయ్య , సాయిబాబా, వీరికి అందజేయడం జరిగింది. ఎవరైనా సెల్ ఫోన్ పోగొట్టుకున్న పెద్ద శంకరంపేట్ పోలీస్ స్టేషన్లు ఫిర్యాదు చేయగలరు. ట్రేస్ చేసి ఇవ్వడం జరుగుతోందని తెలిపారు.

# ముందు వెళ్తున్న స్కూటీని ఢీకొన్న ఆర్టీసీ బస్సు

- **ఒకరు మృతి, ముగ్గురికి గాయాలు**

**మనోహరాబాద్, జులై 21 (సిరి న్యూస్)** ముందు వెళ్తున్న స్కూటీని వెనుక నుండి అతివేగంగా వచ్చిన ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో ఒక వ్యక్తి మృతి చెందగా మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని కాలకల్ బంగారమ్మ దేవాలయ సమీపంలోని జాతీయ రహదారిపై సోమవారం చోటుచేసుకుంది. ఎస్సై సుభాష్‌గౌడ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ లోని అనకాపల్లి ప్రాంతం నుండి బతుకుతెరువు కోసం తేజ అనే యువకుడు 20రోజుల క్రితం మేడ్చల్ జిల్లా గుండ్ల పోచంపల్లి గ్రామానికి వచ్చి స్థానికంగా ఉన్న కంపెనీలలో పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. తేజ తో పాటు అతని స్నేహితులు ప్రవీణ్, మురళి , లోకేష్ లు ఆదివారం మండలంలోని కూచారం గ్రామ శివారులో ఉన్న ఫామ్ హౌస్ కు వచ్చి ఎంజాయ్ చేసుకున్నారు. సోమవారం ఉదయం స్కూటీపై మేడ్చల్ కు తిరిగి వెళుతుండగా మార్గమధ్యమైన కాలకల్ జాతీయ రహదారిపై వెనుక నుండి అతివేగంగా వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీ కొట్టింది. దీంతో తేజ 19 కు తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. మిగతా ముగ్గురికి తీవ్ర గాయాలు కావడంతో మేడ్చల్ లోని ఆసుపత్రికి తరలించారు. తేజ మృతదేహాన్ని తూప్రాన్ లోని మార్చురీకి తరలించారు. గుండ్ల పోచంపల్లి గ్రామానికి చెందిన నాగ వెంకట అప్పం నాయుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



# పగలు వెన్నెల రాత్రి చీకట్లు..

- **10వ వార్డులో పగలు వెలుగుతున్న వీధిదీపాలు**



**రామాయంపేట జూలై 21 (సిరి న్యూస్)** రామాయంపేట మున్సిపాలిటీ పరిధిలోని పదవ వార్డులో గత కొన్ని రోజులుగా వీధి దీపాలు రాత్రి వేలగకుండా పగటిపూట వెలగడం పట్ల వార్డు ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత కొన్ని రోజుల నుండి రాత్రి అయిందంటే చాలు వీధి దీపాలు వెలగకుండా కాలనీ మొత్తం చిమ్మ చీకట్లో ఉంటుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రిపూట వెలగని బల్బులు పగటిపూట మాత్రం వెలగడం గమనార్హం. ఈ విషయంలో అధికారులు సైతం చూసి చూడనట్లుగా వ్యవహరించడం పట్ల వార్డు ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రాత్రిపూట వీధి దీపాలు లేకపోవడం వల్ల అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని, గుర్తు తెలియని దుండగులు వచ్చిన గుర్తించని విధంగా పరిస్థితి నెలకొందని వాపోతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు పట్టించుకోని సమస్య పరిష్కరించాలని వార్డు ప్రజలు కోరుతున్నారు.

# యూరియా కొరత రాకుండా చర్యలు తీసుకోవాలి



- స్టాక్ వివరాలు అన్ని దుకాణాలలో స్టాక్ బోర్డుపై ప్రదర్శించాలి
- సీజనల్ వ్యాధులు ప్రజలకు ఉన్న చర్యలు తీసుకోవాలి
- జిల్లా అధికారులతో కలెక్టర్ సమీక్ష ప్రావీణ్య జిల్లా కలెక్టర్

**సంగారెడ్డి ప్రతినిధి, జులై 21 (సిరి న్యూస్):** జిల్లాలో ఎక్కడ యురియా కొరత రాకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య అన్నారు. సోమవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా అధికారులతో కలెక్టర్ యూరియా కొరత సీజనల్ వ్యాధుల వ్యాప్తి చెందకుండాచేపట్టాల్సిన చర్యలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు... జిల్లాలో యూరియా కొరత రాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని అన్ని దుకాణాలలో యూరియా స్టాక్ వివరాలు, స్టాక్ బోర్డులలో ప్రదర్శించాలన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన గరిష్ట ధరకు మాత్రమే యూరియా విక్రయించేలా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో యూరియా స్టాక్ వివరాలు ఎప్పటికప్పుడు నమోదు చేయాలని అది వ్యవసాయ శాఖ అధికారులకు సూచించారు. జిల్లాలో వర్షాలు పడుతున్నందున సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా అవసరమైన అన్ని ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. లోతట్టు ప్రాంతాలలో ప్రజలను అప్రమత్తం చేయాలని, శిథిలావస్థలో ఉన్న ఇండ్లలో ఉన్న ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని అధికారులకు సూచించారు. ఈకార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) మాధురి, జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్, జిల్లా వైద్యాధికారిణి గాయత్రీ దేవి, డిసిహెచ్ఓ సంగారెడ్డి, ఇరిగేషన్ డి.ఈ. భీమ్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు

## మహంకాళి జాతర అన్నదాన ప్రసాదం

- తాపీ మేస్త్రీల సంఘం ఆధ్వర్యంలో కార్యక్రమం

**చేగుంట జులై 21 (సిరి న్యూస్)** మెదక్ జిల్లా, చేగుంట మండల కేంద్రంలోని శ్రీ శ్రీ మహంకాళి దేవాలయ వార్షికోత్సవాలు ఘనంగా అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. అమ్మవారి జాతర సందర్భంగా సోమవారం నాడు ఉత్సవాల భాగంగా నేడు అమ్మవారికి సమర్పించిన చీరల వేలం వేశారు. అలాగే అన్నదాన కార్యక్రమాన్ని చేగుంట తాపీ మేస్త్రీల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చేగుంట మండల చుట్టుపక్కల గ్రామాల నుంచి ప్రజలు అందరు భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మ వారిని దర్శించుకొని అమ్మవారి అన్నదాన ప్రసాదం స్వీకరించినారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ ఉసికే శ్రీనివాస్ మాట్లాడుతూ చేగుంట మండల కేంద్రంలోని శ్రీ ఉజ్జయిని మహంకాళి దేవాలయ ద్వితీయ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించడం జరుగుతుందని ఉత్సవాలు దాతల సహ కారంతో ఘనంగా నిర్వహించడం జరిగిందని భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి మూడు రోజులు నిర్వహిస్తున్న కార్యక్రమాలను విజయవంతం చేయడం అదే విధంగా అమ్మవారికి మొక్కులు చెల్లించుకొని అమ్మవారి కృపకు పాత్రులు కావడం జరిగిందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉసికె శ్రీనివాస్, మాజీ ఎంపీపీ మాసుల శ్రీనివాస్, సంగ్రగు స్వామి, అయిత పరంజ్యోతి, కరణం గణేష్, కురుమ లక్ష్మి, కోయల్కర్ రాజేష్, చిట్టబోయిన శ్రీనివాస్, ఆలయ కమిటీ సభ్యులతో పాటు గ్రామస్తులు అందరు పాల్గొన్నారు.

- సిరిన్యూస్ ఎఫెక్ట్

## వనంలో ఈతమొక్కలు నాటిన గౌడ కులస్తులు



**సిద్దిపేట (ప్రతినిధి, జులై 21 (సిరి న్యూస్)** పట్టణంలోని రెండవ వార్డు ఈతవనంలో సోమవారం గౌడ కులస్తులు ఈత మొక్కలను నాటారు. సోమ వారం ప్రచురించిన ఉచి తంగా వస్తే ఏదైనా వృధానే అనే కథనానికి గౌడ కులస్తులు స్పందించారు..మొక్కలను నాటారు.



## మృతుల కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే చింతా ప్రభాకర్



**సంగారెడ్డి ప్రతినిధి, జులై 21 (సిరి న్యూస్) :** కొండాపూర్ మండలంలోని మారేపల్లి, గంగారం, తమ్మలిభాయి తండా, హరిదాస్ పూర్ గ్రామాల్లో ఇటీవల అనారోగ్యంతో మరణించిన కుటుంబాలను సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ పరామర్శించారు. వారి కుటుంబాలకు బి ఆర్ ఎస్ పార్టీ అండగా ఉంటుందని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ గారు ధైర్యం చెప్పారు. ఏ సమస్య ఉన్న తన దృష్టికి తీసుకురావాలని తను అండగా ఉంటానని భరోసా కల్పించారు. మారేపల్లి గ్రామంలో మాజీ ఎంపీపీ మనోజ్ రెడ్డి తండ్రి నారాయణ రెడ్డి అనారోగ్యంతో మృతి చెందగా నేడు ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ గారు కుటుంబాన్ని పరామర్శించారు. గంగారం బి ఆర్ ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు ప్రేమ్ కుమార్ మృతి చెందడంతో వారి కుటుంబాన్ని పరామర్శించారు... హరిదాస్ పూర్ గ్రామంలో బి ఆర్ ఎస్ మాజీ ఏం పి టి సి సత్యాగౌడ్ మనవరాలు ఇటీవల అకాల మరణం చెందగా వారి కుటుంబాన్ని పరామర్శించారు. తమ్మలిభాయి తండా బి ఆర్ ఎస్ పార్టీ సీనియర్ నాయకులు చక్ర నాయక్ మృతి చెందడంతో వారి కుటుంబాన్ని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ గారు పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట మాజీ సి డి సి చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి మండల పార్టీ అధ్యక్షులు విఠల్, గోవర్ధన్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి, పాండురంగం, పి ఏ సి ఎస్ చైర్మన్ రాజు, రుక్మొద్దీన్, నాగయ్య, ఇంద్రారెడ్డి, రామచంద్రయ్య, మల్లా గౌడ్, మోహన్ గౌడ్, షఫీ, వినోద్, కుమార్, అంజిరెడ్డి, ప్రభూ స్వామి, అంజిరెడ్డి, రవీందర్, శేఖర్ లు పాల్గొన్నారు.

# సమస్యలపై దశలవారీ పోరాటం

- సిద్దిపేట జిల్లా ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ



**సిద్దిపేట టౌన్, జులై 21 (సిరి న్యూస్)** ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలపై ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించే దశలవారీ పోరాటం విజయవంతం చేయాలని యు ఎస్ పి సి సిద్దిపేట జిల్లా స్టీరింగ్ కమిటీ నాయకులు ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. పట్టణంలోని ప్రెస్ క్లబ్లో సమన్వయ సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా నాయకులు జి.తిరుపతి రెడ్డి, తప్పెట్ల యాదగిరి, డి.కిష్టయ్య, సుంచు నరేందర్ లు మాట్లాడుతూ ఈ నెల 23,24 తేదీలలో మండల తహసీల్దార్ ల ద్వారా ముఖ్యమంత్రికి వినతి పత్రాలు సమర్పిస్తామని, ఆగస్టు ఒకటిన జిల్లా కేంద్రాల్లో ధర్నాలు నిర్వహిస్తామని, ఆగస్టు 23న హైదరాబాద్ లో రాష్ట్రస్థాయి మహాధర్నా నిర్వహిస్తామన్నారు. ఉపాధ్యాయుల ప్రమోషన్లు బదిలీల షెడ్యూల్‌ను తక్షణమే విడుదల చేసి, ఈ నెలాఖరులోగా ప్రక్రియను పూర్తి చేయాలని, నూతన జిల్లాలకు డిఈఓ పోస్టులను, ప్రతి రెవెన్యూ డివిజన్‌కు డిప్యూటీ ఈఓ, నూతన మండలాలకు యంఈఓ పోస్టులను మంజూరు చేసి, ఉపాధ్యాయుల ఏకీకృత సర్వీసు రూల్స్‌ను రూపొందించి, ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో భాగస్వామ్య సంఘాల నాయకులు ఎండి. అజీజ్, ఎం.కృష్ణ, ఏ.మనీష్ కుమార్, కే.కనకరాజు, ర్యాకం మల్లేశం, ప్రవీణ్ కుమార్, శివాజీ, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

# కొడుకు, కూతురితో తల్లి అదృశ్యం



**పెద్ద శంకరంపేట జులై 21 (సిరి న్యూస్)** పెద్ద శంకరంపేట గ్రామానికి చెందిన లింగయ్య పల్లి భూదేవమ్మ తన కూతురు శ్రీలత(25) కుమారుడు శివ అదృశ్యమైన సంఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది.. పెద్ద శంకరంపేట ఎస్సై ప్రవీణ్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం పెద్ద శంకరంపేట గ్రామానికి చెందిన లింగయ్య పల్లి బూదేమ్మ కూతురు శ్రీలత(25) తన కొడుకు శివతో కలిసి తల్లి ఇంట్లో నివాసం ఉంటుంది.. తల్లి బూదెమ్మ ఇంట్లో లేని సమయంలో ఈనెల 8 న తేదీన తన కూతురు శ్రీలత కురుమారుడు శివతోకలిసి ఇంట్లో నుండి పారిపోయిందని ఇన్ని రోజులు ఎక్కడైనా చుట్టాల దగ్గర వెళ్ళిందేమో అని అన్ని చోట్ల వెతికి నా ఆచూకీ లభించకపోవడంతో తల్లి బూదెమ్మ సోమవారం పెద్ద శంకరంపేట పోలీసులను ఆశ్రయించింది.. తల్లి ఫిర్యాదు మేరకు పేట ఎస్సై ప్రవీణ్ రెడ్డి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు..

- కేసు నమోదు చేసిన పెద్ద శంకరంపేట పోలీసులు